
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వికారాబాద్ - మేడ్చల్
జిల్లాల వార్తలు
7
ఆదివారం 20 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత: గరిష్ఠం 40.7 కనిష్ఠం 21.1

పెన్సిల్ మొనలపై కళాఖండాలు



- ధర్మకోల్‌తో సినిమా సెట్టింగులు
- చాక్‌పీస్‌లతో ప్రముఖుల చిత్రాల రూపకల్పన
- మైక్రో ఆర్టిస్టుగా రాణిస్తున్న కరుణాచారి
- తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- ఆదరణ లేక పల్లెటూరికే పరిమితం

9

ప్రతిభకు అవధులు లేవని ఈ కళాకారుడి నేర్పును చూస్తే స్పష్టమవుతుంది. చాక్‌పీస్‌పై అద్భుతమైన కళాఖండాలు చెక్కడం, పెన్సిల్ మొనపై ప్రముఖుల నగిషీలు తీర్చి దిద్దడం.. థర్మకోల్‌తో బాహుబలి సినిమా సెట్టింగుల వంటివి చేయడంలో అతడికి అతనే సాటి. మైక్రో ఆర్టిస్టుగా నైపుణ్యాన్ని చాటుతున్న కరుణాచారిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

మంచాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి)



భూ భారతితో శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

మర్పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): భూ భారతితో భూ సమస్యలు పరిష్కారం అవుతాయని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతిపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. భూభారతితో 50 శాతం భూ సమస్యలు రెవెన్యూ అధికారుల దగ్గర, మరో 50 శాతం ఆర్డీవో, కలెక్టర్ దగ్గర పరిష్కారం అవుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు రవీందర్, ఐనెల్లి రాచన్న, రఫీయొద్దీన్, సంజీవరెడ్డి, మధుకర్, ప్రభాకర్, ఈశ్వర్, అశోక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో సొంతింటి కల సాకారం

వికారాబాద్: పేదోడి సొంతింటి కల ఇందిరమ్మ ఇళ్ల పథకంతో సాకారం అవుతుందని కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాలో 2,285 మంది లబ్ధిదారులను గుర్తించామని, ఇందులో 340 మంది నిర్మాణాలకు మార్కింగ్ చేయగా, 45 మంది బేస్మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. ఇందులో 26 మందికి రూ.లక్ష చొప్పున నగదు జమ చేసినట్లు వెల్లడించారు. రెండో దశలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెల 22 నుంచి 30వ తేదీలోపు పూర్తి చేసి మే 2న జాబితాను ప్రదర్శిస్తామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో గడువు తీరిన వాహనాలు ఇబ్బడిముబ్బడిగా తిరుగుతూ కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. నిబంధనల ప్రకారం 15ఏళ్లకు పైబడిన వాహనాలను రోడ్డు మీద తిరగనీయొద్దు. ఈ వాహనాల నుంచి వెలువడే పొగ కారణంగా వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. పాత వాహనాల నుంచి వెలువడుతున్న పొగలో కర్బన ఉద్గారాలు అధికంగా ఉండడం వల్ల శ్వాసకోశ వ్యాధులు, ఇతర ప్రాణాంతక ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. అంతేకాకుండా కాలం చెల్లిన వాహనాలు ప్రమాదాలకూ కారణమవుతున్నాయి. వీటిని తుక్కుగా మార్చాలని, రోడ్డు మీద తిరగనీయమని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.



కాలం చెల్లిన వాహనాలతో

కాలుష్యం!



ఉమ్మడి జిల్లాలో 10 లక్షలకుపైగా పాత వాహనాలు

- శివార్లలో కాలుష్యం పెరగడానికి దోహదం
- గడువు తీరిన వాహనాల లెక్కలు తేల్చిన ప్రభుత్వం
- కాలుష్య నియంత్రణకు పకడ్బందీ చర్యలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : పలు నగరాల్లో కాలుష్యం పెరగడంపై కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి గడ్కరీ ఆందోళన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. వాహనాల కాలుష్యం కారణంగానే నగరాల్లో జీవించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గడువుతీరిన వాహనాలపై మళ్లీ చర్చమొదలైంది. పాత వాహనాలను తుక్కుగా మార్చాలని గతంలోనే ప్రభుత్వాలు నిర్ణయించినప్పటికీ ఆచరణలో మాత్రం జరగడం లేదు. అదనంగా పన్నులు కట్టించుకుని ఈ వాహనాలకు మరికొంత కాలం గడువు పొడిగిస్తున్నారు. గతంలో సీఎం రేవంత్ రెడ్డి గడువుతీరిన వాహనాలను తుక్కుగా మారుస్తామని, డీజిల్ వాహనాలను ఔటర్ లోపల

మిగతా 9వ పేజీలో...



15ఏళ్లకు పైబడిన వాహనాలు	
రంగారెడ్డి	4.9లక్షలు
మేడ్చల్	4.7లక్షలు
వికారాబాద్	0.60లక్షలు



గేటుపై వ్యక్తి పేరు, ఫోన్‌నంబర్‌ను తొలగించిన దృశ్యం

నర్సరీ స్థలం

మున్సిపాలిటీదే..

గేటుపై ప్రైవేట్ వ్యక్తి పేరు తొలగించిన అధికారులు

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): 'నర్సరీ స్థలంపై వివాదం' అంటూ శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఐదేళ్ల క్రితం మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్ రోడ్డులో ప్రైమ్‌ల్యాండ్ వెంచర్‌లోని 9,560 చదరపు గజాల పార్కు స్థలంలో నర్సరీని ఏర్పాటు చేశారు. గతేడాది నుంచి ఓ ప్రైవేట్ వ్యక్తి ఈస్థలం నాదంటూ ఆక్రమణకు యత్నిస్తున్నాడు. తాజాగా మరోసారి మున్సిపాలిటీ నర్సరీ బోర్డుకు నల్లరంగును పూసి ఏకంగా తన పేరుతోపాటు ఫోన్‌నంబర్ రాసుకున్న విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకువచ్చింది. శనివారం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో సిబ్బంది ప్రైవేట్ వ్యక్తి పేరును, ఫోన్‌నంబర్‌ను తొలగించారు. ఇది మున్సిపాలిటీ స్థలమని మరోసారి ఇక్కడ ఎలాంటి పనులు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుండెపోటుతో

ఉపాధి కూలీ మృతి



అమృతయ్య(ఫైల్)

పెద్దేముల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనికి వెళ్లిన కూలీ గుండెపోటుకు గురయ్యాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దేముల్ మండలం దుగ్గాపూర్ గ్రామానికి చెందిన వడ్డె అమృతయ్య(59) శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఉపాధిహామీ పనికి వెళ్లాడు. భూమి చదును చేసే పనులు చేస్తుండగా గుండెలో నొప్పి ప్రారంభమైంది. వెంటనే ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యుడు మృతిచెందినట్లు నిర్ధారించాడు. దీంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రతన్‌సింగ్ బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ప్రభుత్వపరంగా రావాల్సినవి వచ్చేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు.



9

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

పరిగికి చెందిన ప్రణవ్‌కు 103వ ర్యాంకు

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్ - మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 13 కేంద్రాలు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ అధికారి సుగుణాబాయి, పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన

మూడుచింతలపల్లి: భూ భారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం మండలంలోని కేశవరం గ్రామంలో నిర్వహించిన భూ భారతిపై అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు. ధరణితో పరిష్కారం కాని లక్షాపూర్వాసుల భూ సమస్యలు భూ భారతితో పరిష్కారం అవుతాయన్నారు. ఆధార్ తరహాలో భూధార్ తీసుకువస్తున్నామని, దీంతో భూములకు పకడ్బందీగా మ్యాపింగ్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింహులుయాదవ్, తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, సీఐ శ్రీనాథ్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్



భక్తులు వెళ్లకుండా కంచె వేసిన దృశ్యం

అనంతుడికే ఎసరు!

1.34 ఎకరాలకు నకిలీ పత్రాల సృష్టి ● కంచె వేసిన బడా సినీ నిర్మాత అల్లుడు

- 12.34 ఎకరాలపై కోర్టులో కొనసాగుతున్న వివాదం
- 200 ఏళ్ల చరిత్ర కలిగిన అనంతపద్మనాభ ఆలయం
- ఏడాదికి రెండుసార్లు ఉత్సవాలు
- ఆలయాన్ని, భూమిని కాపాడాలని కోరుతున్న భక్తులు

దొంగ రికార్డులు సృష్టించారు



అనంతపద్మనాభ స్వామి ఆలయానికి 1.34 ఎకరాల భూమిని బూచన్‌పల్లి చిన్న బాల్‌రెడ్డి ఇచ్చారు. కొందరు కావాలనే నకిలీ పత్రాలు సృష్టించి దానిని ఇతరులకు అమ్మేశారు. ఇప్పుడు ఓ పెద్ద వ్యాపారి వచ్చి అందులో కంచె వేసి దౌర్జన్యం చేస్తున్నాడు.

- సుదర్శన్‌రెడ్డి, బిక్కారెడ్డిగూడెం, మోమిన్‌పేట

వికారాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం.. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయం.. సాక్షాత్తు అనంతపద్మనాభుడు నడయాడిన పుణ్య ప్రదేశం. పచ్చని ప్రకృతిలో కొండపై వెలిసిన అనంతపద్మనాభ స్వామి ఆలయం కనుమరుగయ్యే ప్రమాదంలో పడింది. ఆలయ భూమికి అక్రమంగా రికార్డులు సృష్టించి, ఆపై కొనుగోలు చేసి ఇప్పుడు ఏకంగా ఆలయం వద్దే కంచెలు వేసి దౌర్జన్యం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. సినీ పరిశ్రమలో పేరు పొందిన ఓ నిర్మాత అల్లుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ ఆలయ భూమికి ఎసరు పెట్టినట్లుగా ఆలయ భక్తులు, పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం మొరంగపల్లి, మోమిన్‌పేట శివారులోని గుట్టపై వెలిసిన అనంతపద్మనాభ స్వామి (అనంతపద్మనాభ చిత్ర కళామందిరం) ఆలయానికి చెందిన 1.34 ఎకరాలను ఆక్రమించి కంచె వేశారు.

ఆలయానిది మహోన్నత చరిత్ర

అనంతపద్మనాభ స్వామి మర్పల్లి మండలం కల్కోడ మీదుగా మొరంగపల్లి, మోమిన్‌పేట శివార్లలోని గుట్టపై కొలువుదీరి, ఇక్కడి నుంచి వికారాబాద్‌లోని అనంతగిరిపై అనంతస్వరూపుడిగా అవతరించారని ఈ ప్రాంత ప్రజల నమ్మకం.. ఈ ప్రదేశంలోనే

మిగతా 10వ పేజీలో..

భూ భారతితో రైతుల సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న లింగ్యానాయక్

బంట్వారం ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): భూభారతితో భూసమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం బంట్వారం రైతు వేదికలో భూభారతి రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతూ... ధరణిలో పరిష్కారం కాని సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం దొరుకుతుందన్నారు. మోసపూరితంగా ఎవరైనా రికార్డులు చేసినట్లయితే దానిని రద్దు చేసే అధికారం ఈ చట్టంలో ఉందన్నారు. మ్యుటేషన్లో అభ్యంతరాలుంటే కలెక్టర్‌కు ఫిర్యాదు చేసుకునే అవకాశముందన్నారు. పెండింగ్ సాదాబైనామాలను క్రమబద్ధీకరించి పట్టా చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఏవో శ్రావ్య, తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్సై శ్రీశైలం, నాయకులు వెంకటేశం,యాదగిరి, నర్సింలు, ఇసాక్, ప్రభాకర్, అరుణ్, మహేష్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వరికి వడగండ్ల గండం

- కమ్ముకొస్తున్న మబ్బులు
- రైతుల్లో గుబులు


కొద్ది రోజుల్లో కోతకు రానున్న వరి పంట

యాచారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సాగైన వరి పంట దాదాపు చేతికొచ్చింది. నీరందక ఎండిన పంట పోను పారిన చేను మరో పదిహేను రోజుల్లో కోతకు రానుంది. ఈ నేపథ్యం వేసవి వానలు, వడగండ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వానొచ్చి ఎక్కడ చేతికొచ్చిన పంట నేలపాలవుతుందోనని భయపడుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో యాసంగిలో 93,500 ఎకరాల్లో వరి వేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో 7,500ఎకరాలు, తలకొండపల్లిలో 7,000 ఎకరాలు,యాచారంలో 4350ఎకరాల మేర వరిసాగు చేశారు. దీంతో 65,560 టన్నుల వడ్లు పండుతాయని అధికారుల అంచనా. ఇబ్రహీంపట్నం చెరువులో నీరుండడంతో సమీప గ్రామాల్లో భూగర్భ జలమట్టం పెరిగి బోర్ల కింద వరి వేశారు. మరో 15 రోజుల్లో వరి చేతికందుతుంది. కాగా ముందు నాట్లేసిన వరి ఇప్పటికే కోశారు. ఎండ కాలంలో ఉన్నట్టుండి క్యాములోనింబస్ మేఘాలు కమ్ముకొని కుండపోత వర్షం పడుతుంది. అలాగే కొన్నిసార్లు వడగండ్లు సైతం పడతాయి. కోతకొచ్చిన వరి చేన్లలో వడ్లన్నీ రాలుతాయి. ఈదురుగాలులకు కూడా వడ్లు రాలతాయి. ఇదిలా ఉంటే ఇటీవల వడగండ్ల వానకు యాచారం మండలంలో 214ఎకరాల్లో, తలకొండపల్లిలో 87 ఎకరాలలో, మంచాలలో 90ఎకరాల్లో వరి పంట పాడైంది. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో 15శాతం పంట మాత్రమే కోశారు. కోతకొచ్చిన పంట వానలతో ఎక్కడ చేతికందకుండాపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

మామిడితోటలకు అపార నష్టం

ఇదిలా ఉండగా బారీ ఈదురు గాలుల కారణంగా 85శాతం మేర మామిడి కాయలు నేలరాలి రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. కాత బాగా పట్టిందని ఆనందించిన రైతులపై వర్షాలు నీళ్లకు మ్మరించాయి. ఇప్పటికే నగం మామిడి నేలరాలింది.

పంట చేతికందుతుందనే నమ్మకం లేదు


నీరందక ఇప్పటికే ఎకరం వరిపంట ఎండిపోయింది. వారం రోజుల క్రితం కురిసిన వడగండ్లతో మరి కొంత పంట పాడైంది. ఉన్న పంటైనా చేతికందుతుందో లేదోనని భయమైతోంది. మేఘాలనుచూస్తే వానొస్తుందేమోనని ఆందోళన కలుగుతోంది. మరో పదిహేను రోజులైతే పంట కోతకొస్తుంది.

- బైకని శ్రీనివాస్, రైతు, కుర్మిద్ద

పాడైన పంట వివరాలు సేకరించాం


ఇటీవలి వడగండ్లతో పాడైన పంటల వివరానలు ప్రభుత్వానికి నివేదించాం. రైతులు కష్టపడి పంట పండిస్తే అకాల వర్షాలతో పంట పాడవడం వారికి తీవ్ర నష్టం. గ్రామాల్లో పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశాం. నివేకలు ప్రభుత్వానికి పంపి రైతులను ఆదుకునేందుకునేందుకు కృషి చేస్తున్నాం.

- నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో అన్నదాతలు

బషీరాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు కురుస్తుండటంతో ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతన్న తల పట్టుకుంటున్నారు. వరిపంట చేతికొచ్చే దశలో ఈదురు గాలులతో కూడిన వర్షాలతో గింజ పట్టిన వరిపైరు నేలకొరిగి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బషీరాబాద్ మండలంలో నాలుగైదు రోజులుగా సాయంత్రం పూట మబ్బులు కమ్ముకుంటూ ఈదురుగాలులతో వర్షం పడుతోంది. ఈ వర్షాలతో పొలాల్లోని ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. ఎకరాకు రూ.30వేల వరకు పెట్టుబడి పెట్టామని, వారం, పది రోజుల వ్యవధిలో వరి పంట చేతికొస్తుందని.. ఈ సమయంలో వానొచ్చి వడ్లు తడిస్తే దిగుబడి, ధర తగ్గే అవకాశం ఉందని రైతులు దిగులుపడుతున్నారు.


బషీరాబాద్‌లో కోతకొచ్చిన వరి చేను

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే రంగారెడ్డి

మంచాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాలు సైతం సర్వతోముఖాభివృద్ధి సాధించేలా కార్యక్రమాలు చేపట్టడమే ప్రభుత్వ లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు.


ఆగాపల్లి-నోముల రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

మండల పరిధి ఆగాపల్లి, కాగజ్‌ఘట్, జాపాల, హస్మత్‌పూర్ గ్రామాల్లో రూ.4.72 కోట్లతో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపనలు చేశారు. ఇంకా ముఖ్యమం త్రి సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ. 12,69,500 విలువైన చెక్కులను లబ్ధిదారులకు పంపి ణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని కొ నియాడారు. గ్యారెంటీల అమలు, మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజలకందజేస్తామన్నారు. భారీగా నిధు లు తెచ్చి అభివృద్ధి చేస్తా మన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, బి.మహిపాల్, జయమ్మమల్లేష్, ఏఎంసీ చైర్మన్ గుర్నాథ్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ హన్మంతరెడ్డి, ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, రమాకాంత్‌రెడ్డి, వెంకటేశ్, జంగయ్య, ఎల్లే శ్, ఎడ్మ నరేందర్‌రెడ్డి, జయానందం, వాజిద్, లావణ్యాబాలశివుడు, ఐలేశ్, చంద్రయ్య, ఎం.సురేష్, నాగరాజు, సికిందర్‌రెడ్డి, రాఘవ, రాజేష్, శివ, అష్రఫ్, వి.రాంరెడ్డి, బి.జగన్, పి.శ్రీనివాస్, పి.మూర్తి పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పాలి

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న రాజకీయ పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. శనివారం కవ్వగూడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ మౌలిక లక్షణాలను చెరిపేసేలా బీజేపీ వ్యవహరిస్తోందని అన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఎలా అవమానపరుస్తూ, వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోందో ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని కవ్వగూడ, నర్కూడలో ఎమ్మెల్యే, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. కవ్వగూడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జైసంవిధాన్ అభియాన్ గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం పార్టీ చేసిన పోరాటాలు, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి జానకీరామ్, నాయకులు నీరటి తన్వీరాజు, శేఖర్‌యాదవ్, సంజయ్, వెంకటేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, అశోక్, సిద్ధేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



కవ్వగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, చైర్మన్ జ్ఞానేశ్వర్

ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జంగయ్య

శంషాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఐఏటీయూసీ ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో తెలంగాణలోని వివిధ జిల్లాల నాయకులు పాల్గొంటారన్నారు. శంషాబాద్ బస్టాండ్ నుంచి శంషాబాద్ ఎంఎంఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే బహిరంగసభ నిర్వహిస్తామన్నారు. కార్మికుల సమస్యలపై సభలో చర్చిస్తామన్నారు. భవన నిర్మాణ వలస కార్మికులతో 14గంటలు పనిచేయిస్తూ శ్రమదోపిడీ చేస్తున్న కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకు ఒత్తిడి తెస్తామన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తులో వారి సమస్యలు పరిష్కరించే విధంగా పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో సామిడి శేఖర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు నర్రా గిరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతితో మరింత బాధ్యత


ఎస్పీ నారాయణరెడ్డితో ప్రమోషన్ పొందిన హెడ్‌కానిస్టేబుళ్లు

వికారాబాద్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):ఉద్యోగో న్నతి కేవలం హోదాలో మార్పు కాదని, ఇది ఉద్యోగిపై మరింత పెరిగిన బాధ్యత అని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లాలో 17మంది కానిస్టేబుళ్లకు హెడ్‌కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ రాగా వారిని ఎస్పీ కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నూతన హెడ్‌కానిస్టేబుళ్లు విధుల నిర్వహణలో మ రింత అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు. నిబంధనలను, చట్టాలను పాటిస్తూ తమ పరిధి జూనియర్ సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. పదోన్నతిపొందిన హెడ్‌కానిస్టేబుళ్లు బాగా పనిచేయాలని సూచిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగిన బీజేపీ

ఆమనగల్లు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):ఇతర రాజకీయ పార్టీలను తోసిరాజని బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలుస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎస్‌బీసీ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి అన్నారు. తమ విధానాలు, పథకాల అమల్లో నిర్లక్ష్యంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజా విశ్వాసం కోల్పోయాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కల్వకుర్తిలో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. మాడ్గుల మండల బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు పెద్దయ్యాయాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఆచారి హాజరై పార్టీ క్రియాశీల సభ్యత్వాలు, పార్టీ బలోపేతం, ప్రజాస మస్యలపై పోరాట కార్యాచరణను రూపొందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనా దక్షతతో పదేళ్లలో దేశం ఎన్నో విజయాలు సాధించిందన్నారు. బీజేపీకి తిరుగులేదని రాష్ట్రాల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో గోరటి నర్సింహ్మా, శివరామ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, వెంకటేశ్, శ్రీను, మహేదేవ్‌శర్మ, కె.వెంకటేశ్, రవినాయక్, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆచారి

పెన్సిల్ మొనలపై కళాఖండాలు



థర్మకోల్‌తో భారతదేశం, భరతమాత, పరిపూర్ణానంద శిల్పాలు

మంచాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మంచాల మండల పరిధిలోని కాగజ్‌ఘట్‌కు చెందిన కరుణాచారిది నిరుపేద కుటుంబం. ఉత్తరపల్లి రాములమ్మ-చంద్రయ్యలకు నలుగురు కొడుకులు, ఓ కూతురు. వారిలో కరుణాచారి మూడోసంతానం. ఆయనకు చిన్నతనం నుంచే కళానైపుణ్యం ఏర్పడింది. అందరిలా కాకుండా కొత్తగా ఏదైనా చేయాలనే ఆలోచనతో తన కళకు పదును పెట్టాడు. చాక్‌పీసులు, పెన్సిల్ మొనలపై అద్భుత కళాఖండాలు చెక్కుతూ నైపుణ్యాన్ని చాటుతున్నాడు. బీఎస్సీ, బీఈడీ చదివిన కరుణాచారి ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే సమయం చిక్కినప్పుడల్లా మైక్రో ఆర్ట్స్ తయారు చేస్తున్నాడు. మహాత్మా గాంధీ, స్వామీ వివేకానంద తెలంగాణ తల్లి, నరేంద్రమోదీ, కేసీఆర్ వంటి ప్రముఖుల చిత్రాలను చాక్‌పీసులు, పెన్సిల్ మొనలపై మలుస్తూ మన్ననలు పొందుతున్నాడు.

థర్మకోల్‌తో సినిమా సెట్టింగ్‌లు..

కరుణాచారి కాలానుగుణంగా విభిన్నమైన ప్రతిభాపాటవాలను చాటుతున్నాడు. థర్మకోల్‌తో సినిమా సెట్టింగ్‌లు తయారు చేయడంలోనూ మంచి ప్రావీణ్యం ఉంది. జై మాహిష్మతీ పేరు వింటే గుర్తుకు వచ్చే బాహుబలి సినిమా సెట్టింగ్‌లో థర్మకోల్‌తో టేబుల్ సైజులో రూపొందించి భళా అనిపించుకున్నాడు. బాహుబలి సినిమాలో అబ్బుర పరిచే దృ శ్యాలతో కూడిన థర్మకోల్ సెట్టింగ్‌ను కేవ లం నెల రోజుల్లోనే సృష్టించి అబ్బురపరిచాడు. అదీ కేవలం రూ.4 వేల ఖర్చుతోనే మాహిష్మతీ కోటతో పాటు బాహుబలి సినిమాలోని పాత్రదారుల చిత్రాలు, యుద్ధ సన్నివేశాలు, గోడె, బాల్‌తో శత్రువులపై దాడి చేసి బండి, బాణాల రూపకల్పన చేయడమేగాకుండా వీటిని ప్రయోగించే విధంగా తయారు చేశాడు.



చాక్‌పీస్‌పై సింగం సినిమాలో హీరో సూర్య రూపం

ఆటుపోట్లతో జీవన ప్రయాణం..

కరుణాచారి జీవన ప్రయాణం అనేక ఆటుపోట్లతో సాగింది. తల్లిదండ్రులు పనిచేసే వడ్రంగి కులవృత్తితో వచ్చే తిండి గింజలతోనే అన్నదమ్ముల విద్యాభ్యాసం సాగింది. ఇంటర్మీడియట్ చదివే వయసులోనే కరుణాచారి రోడ్డు ప్రమాదంలో వెన్నెముక దెబ్బతిని సుమారు రెండేళ్లపాటు మంచానికే పరిమితమయ్యాడు. కొద్దికాలానికే ఆ కుటుంబంలో పెద్దకుమారుడు అనారోగ్యానికి గురై ఆకస్మికంగా మృతి చెందాడు. ఇన్ని ఆటుపోట్లలోనూ విద్యాభ్యాసం పూర్తిచేసిన కరుణాచారి ప్రస్తుతం ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు...

మైక్రో ఆర్టిస్టుగా ప్రతిభను చాటుతున్న కరుణాచారికి ఇటీవలే తెలుగు బుక్ అవార్డు పురస్కారం లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువాళ్ల గొప్పతనాన్ని గుర్తించే ఈ సంస్థ చాక్‌పీసులు, పెన్సిల్ మొనలపై మైక్రోఆర్ట్‌ను గుర్తించి తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కరుణాచారి పేరుచేర్చి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

అవకాశం వస్తే సినిమాల్లో పనిచేస్తా..

ఆర్ట్ వేయడం అంటే నాకు చిన్ననాటి నుంచి ఇష్టం. మైక్రో ఆర్టిస్టుగా పెన్సిల్ మొనలు, చాక్ పీసులతో నేను చేసిన ఎన్నో కళాఖండాలు ఇప్పటి వరకు ప్రదర్శణ వరకే ఉపయోగపడుతున్నాయి. ఆర్థికంగా ఉపయోగం లేకుండా పోతోంది. నాకు అవకాశం వస్తే సినిమా సెట్టింగుల ఏర్పాటులో పనిచేయాలని ఉంది. దీంతో నాకు నచ్చిన పనిచేస్తూ కుటుంబానికి చేయూత అందించాననే తృప్తి కలుగుతుంది.

– కరుణాచారి, మైక్రో ఆర్టిస్ట్

'ఆంధ్రజ్యోతి' బైక్ విజేతకు చెక్కు అందజేత

సిద్దిపేట కల్చరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో బైక్‌ను గెలుచుకున్న సిద్దిపేటకు చెందిన సొప్పదండి వేణుకృష్ణకు శనివారం చెక్కు అందజేశారు. సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు చేతుల మీదుగా వేణుకృష్ణకు చెక్కు అందజేశారు. తనకు వచ్చిన బహుమతితో వేణుకృష్ణ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ.. 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిగా ఉండటం వల్ల వార్తవిశేషాలు తెలుసుకోవటంతో పాటు బహుమతిని గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు.



వేణుకృష్ణకు చెక్ అందజేస్తున్న హరీశ్‌రావు

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

పరిగి/శంకర్‌పలి/కడ్తాల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో వికారాబాద్ జిల్లా పరిగికి చెందిన విద్యార్థి ప్రతిభను చాటారు. జాతీయ స్థాయిలో 103 ర్యాంకు సాధించారు. పరిగి పట్టణానికి చెందిన కనకం గౌరీశంకర్ కుమారుడు కె.ప్రణవ్ జేఈఈ మెయిన్స్ రాశాడు. జాతీయస్థాయిలో జనరల్ కేటగిరిలో 103వ ర్యాంకు సాధించి 99.996శాతం మార్కులు సాధించాడు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం కొండకల్‌కు చెందిన అంజిరెడ్డి, జ్యోతి దంపతుల కుమారుడు జస్వంత్‌రెడ్డి జేఈఈలో 98.46శాతం మార్కులతో 23,577వ ర్యాంకు సాధించాడు. కడ్తాల్ మండల పరిధిలో చల్లంపల్లికి చెందిన మహిపాల్‌రెడ్డి 94.34 మార్కులు సాధించాడు. విద్యార్థులను వారి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభినందించారు.

కల్యాణలక్ష్మితో పేదల బతుకుల్లో వెలుగు



చెక్కులు అందిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వెలుగులు తెచ్చాయని అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మోమిన్‌పేట్ రైతువేదికలో చెక్కులు పంపిణీ చేశారు. ప్రభుత్వం పేదింటి ఆడపడచుల పెళ్లిళ్లకు సహాయం అందిస్తోందన్నారు. 42మందికి చెక్కులను స్పీకర్ అందించారు. కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ మనోహరచక్రవర్తి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, డీటీ సురేశ్, సుభాష్‌గౌడ్, సురేందర్, ఏరాజ్‌పాష, ఏజాజ్‌పాష, బాగ్దాద్, నర్సింహారెడ్డి, వెంకటయ్య, మానయ్య యాదవ్, రవి, అస్లాం, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం

చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమక్షంలోనే జరగగా నాయకులు, కార్యకర్తలు ఒకరిపై ఒకరు దురుసుగా మాట్లాడుకున్నారు. చేసేదేమీ లేక స్పీకర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశం రసాభాస

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో శనివారం జరిగిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సమావేశం రసాభాస అయ్యింది. కమ్యూనిటీ హాల్‌లో మున్సిపల్ కమిషనర్ ఆధ్వక్షతన ప్రారంభమైన సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు, బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకున్నారు. తమకు సమాచారం ఇవ్వలేదని కొందరు నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు పరస్పర విమర్శలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ పావని, నాయకులు ముత్యాలు, రమేష్, ఖయ్యూం, వెంకట్‌రెడ్డి, రమాదేవి, సంగీత, అంజనేయులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కాలంచెల్లిన వాహనాలతో కాలుష్యం!

(7వ పేజీ తరువాయి)

తిరిగేందుకు అనుమతి ఇవ్వమని ప్రకటించారు. అయితే దీనిపై వాహనదారుల నుంచి ముఖ్యంగా క్యాబ్, ఆటో నడిపే వారి నుంచి వ్యతిరేకత రావడంతో అమల్లో వెనక్కి తగ్గారు.

నిబంధనలు బేఖాతర్

వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు 15ఏళ్లు పైబడిన వాహనాలను గడువుతీరినట్లుగా పరిగణిస్తారు. సరుకు రవాణాచేసే వాహనాలైతే 10ఏళ్లు దాటితే గడువు తీరినట్లే. వీటికి ఫిట్‌నెస్ సామర్థ్యం ఉంటే గ్రీన్‌టాక్స్ కట్టించుకొని మరో ఐదేళ్ల పాటు రోడ్లపై తిరిగేందుకు అనుమతి ఇస్తున్నారు. కాలం చెల్లిన వాహనాలకు అనుమతులు తీసుకోకుండా గ్రీన్‌టాక్స్ కట్టకుండా ఉంటే పట్టుబడిన సమయంలో భారీగా జరిమానా విధిస్తారు. అలాగే ఏ వాహనమైనా కూడా కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రం లేకుండా రోడ్డుపై తిరిగే వీలులేదు. వీటిని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. నగర, శివారు ప్రాంతాల్లో భారీగా గడువు తీరిన వాహనాలున్నాయి. వీటి మెయింటెనెన్స్ కూడా అంతంత మాత్రమే. ఫిట్‌నెస్ లేకుండానే వాహనాలను విచ్చలవిడిగా నడుపుతున్నారు. వీటివల్ల కాలుష్యం పెరగడంతో పాటు భద్రత కూడా ప్రశ్నార్థకరంగా మారింది. రోడ్డు ప్రమాదాలకు కాలం చెల్లిన వాహనాలే కారణంగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే అత్యధికంగా కాలంచెల్లిన వాహనాలు తిరుగుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా కాలం చెల్లిన వాహనా లు 24లక్షల వాహనాలు ఉండగా ఇందులో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 10లక్షలకుపైగా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో 4.9లక్షలు,



మేడ్చల్‌లో 4.7లక్షలు, వికారాబాద్ జిల్లాలో 50వేలకుపైగా కాలం చెల్లిన వాహనాలున్నాయి. వీటిల్లో 75శాతం టీవీలర్లే!

ఏక్యూఐ 200 దాటేస్తుంది...

వాహనాల నుంచి వెలువడుతున్న కర్బన ఉద్గారాలు అధికంగా ఉండడంతో శ్వాసకోశ సంబంధ వ్యాధులు, ఇతర ప్రాణాంతక ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. నగర శివార్లలో పట్టణీకరణ శరవేగంగా సాగడంతో వాహనాల రద్దీ భారీగా పెరిగింది. దీంతో వాహనకాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. సాధారణంగా వాయి నాణ్యత స్థాయి(ఏక్యూఐ) 50 పాయింట్లలోపు ఉంటే వాతావరణంలో స్వచ్ఛమైన గాలి ఉన్నట్లుగా పరిగణిస్తారు. అదే ఏక్యూఐ 100పాయింట్లు దాటితో కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు చెబుతారు. నగరశివార్లలోని అనేక ప్రాంతాల్లో చాలాసార్లు ఏక్యూఐ 200పాయింట్లు దాటుతోంది. దీనికి పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యమే కాక వాహనాల నుంచి వెలువడే కాలుష్యం కూడా కారణమే. వాయి కాలుష్యాన్ని తగ్గించేందుకు డీజిల్, పెట్రోల్ వాహనాలను నియంత్రించి వాటి స్థానంలో ఎలక్ట్రికల్ వెహికల్స్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే వాయి కాలుష్యానికి డీజిల్, పెట్రోల్ కాకుండా వాహనాల టైర్లు, బ్రేక్‌ప్యాడ్లు, రోడ్లు కూడా కారణమవుతున్నాయి.

ఆన్‌లైన్ ద్వారానే జరిమానాలు

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలకు జరిమానాలు వేస్తున్న విధంగానే కెమెరాల ఆధారంగా కాలుష్య వాహనాలకు జరిమానాలు వేసే విధానాన్ని అమల్లోకి తేనున్నారు. ఇందుకు రియల్ టైమ్ ఎన్ఫోర్స్‌మెంట్ వ్యవస్థను ఏర్పాటుచేస్తున్నారు. కొత్తగా కొన్న వాహనాలకు ఏడాది వరకు పొల్యూషన్ అండ్ కంట్రోల్ (పీయూసీ) సర్టిఫికెట్ అవసరం లేదు. తరువాత ప్రతి ఆరు నెలలకోసారి(పీయూసీ) సర్టిఫికెట్ పొందాలి. ఇప్పటివరకు దీన్ని పెద్దగా ఎవరూ పాటించడం లేదు. రోడ్డు మీద వెళ్లే వాహనాలు ఆపి తనిఖీచేస్తే తప్పా పీయూసీ సర్టిఫికెట్ ఉందో లేదో తెలియదు. ఇపుడు వాహన కాలుష్య నియంత్రణకు ప్రభుత్వం తాజాగా వెహికులర్ పొల్యూషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(వీపీఎంఎస్)ను అమల్లోకి తెస్తోంది. దీని ప్రకారం వాహనాలకు జారీచేసే పీయూసీ సర్టిఫికెట్లన్నీ ఇక ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తారు. పోలీసు ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా తరుచూ వాహనాల నంబర్లను స్కాన్ చేస్తారు. దీని ఆధారంగా కూడా గడువు తీరిన వాహనాలకు ఆటోమెటిక్‌గా చలానాలు విధిస్తారు.

తుక్కుగా మార్చితే ప్రోత్సాహకాలు

కాలం చెల్లిన వాహనాలను తక్కుగా మారిస్తే ప్రభుత్వ ప్రోత్సాహకాలు లభిస్తాయి. కొత్త వాహనాల కొనుగోలులో 10శాతం రాయితీ కల్పిస్తున్నారు. అంతేకాక ఈవీ (ఎలక్ట్రికల్ వెహికల్స్) వాహనాలు కొనుగోలు చేస్తే జీవిత కాలం పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీలు రద్దు చేసింది. రోడ్డు పన్నులు మినహాయిస్తున్నారు.

గాలివాన బీభత్సం



చేవెళ్ల: కేసారంలో వాలిన విద్యుత్ స్తంభం



ఎన్కెపల్లిలో నేలవాలిన మొక్కజొన్న చేనులో రైతు కిష్టయ్య



ధారూరు: ధారూరులోని రోడ్డుపై పడిపోయిన కొబ్బరి చెట్టు

చేవెళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పలు చోట్ల గాలివాన బీభత్సం సృష్టించాయి. విద్యుత్ స్తంభాలు కూలి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. చేవెళ్ల మండలంలో శనివారం సాయంత్రం బలమైన గాలులు వీచాయి. కొద్దిపాటి వర్షం కురిసింది. గాలలతో కేసారం విద్యుత్ స్తంభం విరిగింది. ఎలాంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ సిబ్బందికి సమాచారమివ్వడంతో విద్యుత్ సరఫరా నిల్పివేశారు. పంట పొలాల్లో చెట్లు విరిగిపడ్డాయని రైతులు పేర్కొన్నారు.

కోట్‌పల్లి: మండల కేంద్రం, ఎన్కెపల్లి గ్రామాల్లో గాలివాన బీభత్సానికి పంటలు నష్టం జరిగింది. ఎన్కెపల్లిలో కిష్టయ్య అనే రైతు మొక్కజొన్న నేలకొరిగింది. కోట్‌పల్లిలో బుచ్చమ్మ ఇంటి పైకప్పుఎగిరిపోయింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. సరఫరా నిలిచిపోయింది.

ధారూరు: శనివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో గాలివాన బీభత్సం సృష్టించింది. పలు గ్రామాల్లో గాలివాన ధాటికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ధారూరు సంతలో కూరగాయల మార్కెట్‌లో కూరగాయాలు వాన నీటిలో కొట్టుకుపోయాయి.

నేల రాలిన పంటల పరిశీలన

తాండూరు రూరల్: అంతారం, అంతారంతండా, ఖాంజాపూర్, బెల్కటూర్, ఎల్మకన్నె, చెంగోల్, గోనూరు తదితర గ్రామాల్లో వర్షానికి వరిపంట రాలిపోయింది. వ్యవసాయ అధికారులు పర్యటించి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. శనివారం ఏఈవో శివకుమార్ పర్యటించి వివరాలు సేకరించారు. కోత దశలో ఉన్న వరి గాలివానకు రాలిపోయిందని రైతులు వాపోయారు. తాండూరు నియోజకవర్గంలో 350ఎకరాల్లో పంట నష్టం జరిగిందని ఏడీఏ రుద్రమూర్తి తెలిపారు. బషీరాబాద్, పెద్దేముల్, యాలాల, తాండూరు మండలాల్లో నష్టం వాటిల్లిందన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

మర్పల్లి: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. మర్పల్లి, కొత్లాపూర్‌లలో దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం అందేలా కృషిచేస్తారని తెలిపారు. అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించాలన్నారు. ఏవో శ్రీకాంత్, హార్టికల్చర్ అధికారి అక్షితరెడ్డి ఉన్నారు.

ఆదుకోండి సారూ...

పెద్దేముల్: వడగండ్లతో వరిపంటను కోల్పోయామని, తమను ఆదుకోవాలని జనగాం, మంబాపూర్ గ్రామాల రైతులు ఎమ్మెల్యేతో మొరపెట్టుకున్నారు. మన్‌సాన్‌పల్లి, మంబాపూర్, దుగ్గాపూర్, మారెపల్లి, జనగాం, కొండాపూర్, మారెపల్లితండా గ్రామాల్లో రెండు రోజుల క్రితం వడగండ్లవాన కురిసింది. కోతకొచ్చిన వరిపంట దెబ్బతింది. శనివారం రైతులు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని కలిసి గోడువెల్లబోసుకున్నారు. ఎమెల్యే స్పందించి అధికారులకు ఫోన్‌చేసి రైతులకు కలిగిన నష్టాన్ని అంచనా వేయాలని చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు.



తాండూరు రూరల్: ఖాంజాపూర్‌లో పంటను పరిశీలిస్తున్న ఏఈవో



మర్పల్లి: అరటి పంటను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి



నానక్‌నగర్‌లో టీజీఐఐసీ, రెవెన్యూ, అటవీ, పోలీస్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీసీపీ సునీతారెడ్డి

రైతుల సమస్యలు పరిష్కరిద్దాం

● డీసీపీ సునీతారెడ్డి, ఆర్‌డీవో అనంతరెడ్డి

యాచారం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):పనులు చేస్తున్న చోటకు రైతులు వచ్చి అడ్డుకుంటే వారిని శాంతియుతంగా సముదాయించాలి. మీకేమైన ఇబ్బందులుంటే నేరుగా తనకు లేదా ఏసీపీలకు సూచించాలి అని మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో అనంతరెడ్డిలు అన్నారు. శనివారం యాచారం మండలం నానక్‌నగర్‌లో అటవీ, రెవెన్యూ, టీజీఐఐసీ, పోలీస్ శాఖల సిబ్బంది, అధికారులతో వారు మాట్లాడారు. ఇంత కాలం భూమిని నమ్ముకొని పంటలు పండించుకుంటున్న రైతుల పొలం పోతే వారికి బాధగా ఉంటుందని, అందుకే వారు కొన్నిసార్లు నిరసనలు వ్యక్తం చేస్తుంటారని అన్నారు. భూముల విషయంలో కోర్టులో కేసులుంటే వాటికి ఫెన్సింగ్ చేయకుండా వదిలేయాలన్నారు. ఫార్మాసిటీ భూములకు ఫెన్సింగ్ పనులను రైతులకు ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైతులను సముదాయించి పనులు చేసుకోవాలన్నారు. నేడు సాఫీగా పనులు చేస్తున్నారంటే అందరి కృషి పట్టుదల వల్లేనని గుర్తు చేశారు. ఉద్యోగులమంతా ప్రజల కోసమే అనే భావనతో ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో అనంతరెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు, స్పెషల్ పార్టీ ఏసీపీ సురేష్, సీఐలు కృష్ణంరాజు, వేణుగోపాల్, జితేందర్‌రెడ్డి, వరుణ్, టీజీఐఐసీ జీఎం శ్రావణ్‌కుమార్ తదితరులున్నారు. కాగా ఆర్డీవో మేడిపల్లి, పల్లెచెల్కతండా, కుర్మిద్ద గ్రామాల రైతుల గోడువిన్నారు. న్యాయం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. పనులు అడ్డుకోవద్దని కోరారు. గతంలోనే ప్రభుత్వం పరిహారం ఇచ్చిందని, ఇప్పుడు మా భూమి అని రావొద్దని కోరారు. డబ్బు రానివారుంటే వారికి తప్పకుండా ఇప్పిస్తామని చెప్పారు.

మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

కొత్తూర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):కొత్తూర్ మున్సిపాలిటీని మాస్టర్ ప్లాన్‌తో తీర్చి దిద్దుతామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ బాతుకలావణ్యదేవేందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి, బడ్జెట్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. కాలనీల్లో మురుగునీటి కాలువల నిర్మాణాలు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కౌన్సిలర్లు చెప్పారు. బహిరంగ ప్రాంతాల్లో మురుగునీరు పారుతోందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీని తీర్చిదిద్దేందుకు మాస్టర్ ప్రణాళిక రూపొందిస్తున్నామని, నిధులు మంజూరు చేయించి సమస్యలను దూరం చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులంతా మున్సిపాలిటీని అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు మాధవి, చంద్రకళరాజేందర్‌గౌడ్, శ్రీనివాస్, సోమ్లనాయక్, అనితశ్రీనివాస్‌గౌడ్, హేమదేవేందర్ జయమ్మజనార్ధన్‌చారి, కరుణశ్రీసుదర్శన్‌గౌడ్, ప్రసన్నలతయాదయ్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో నిధులు వెనక్కు

మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా హెచ్‌ఎండీఏ నిధులు వెనక్కు వెళ్లాయని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో మున్సిపాలిటీకి 10కోట్లు మంజూరు కాగా, 3కోట్లకు సంబంధించి పనులు చేశారన్నారు. 7కోట్లు వెనక్కు వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. కాగా 2025-2026కు మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్‌ను చైర్‌పర్సన్ ప్రవేశపెట్టారు. 40.41 కోట్ల బడ్జెట్‌కు రూ.30.98కోట్ల గ్రాంట్లు, 9.43కోట్ల సాధారణ నిధులని పేర్కొన్నారు.

వైభవంగా కలశోత్సవం

తాండూరు, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల చరిత్ర కలిగిన తాండూరు శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో కలశోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం భద్రేశ్వరచౌక్‌లో మంత్రోచ్ఛరణలు, సంప్రదాయబద్ధంగా రథంచుట్టూ ఐదుసార్లు ప్రదర్శణలు చేసి తర్వాత రథంపైకి కలశాన్ని ఎక్కించారు. కలశపూజ కార్యక్రమానికి భ క్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గతంతో పోలిస్తే ఈ యేడాది బ్రహోత్సవాలను అత్య ంత వైభవం నిర్వహించడంతో పాటు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శరణు బసవేశ్వర ఆలయం నుంచి నగరేశ్వ ర గుడి ముందు నుంచి గాంధీ చౌక్ మీదు గా భద్రేశ్వర్‌చౌక్ వరకు కలశ ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం జయ,జయ ధ్వానాల మధ్య కలశాన్ని రథంపైకి భద్రేశ్వరీకి జై అంటూ ఎక్కించారు. ఆలయం నుంచి రథం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చిన కలశానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత, ఆలయ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్, సభ్యులు, వీరశైవ సమాజం ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ రెన్యూవేషన్ కమిటీ చైర్మన్ పటేల్ కిరణ్‌కుమార్, ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, సభ్యులు జాక సంగమేశ్వర్, శెట్టి సురేష్, గాండ్ల వీరన్న, కల్లూరు బస్వరాజ్, కోటం సిద్ధిలింగం, ఎం.ప్రశాంత్, గాదిగి కిరణ్‌కుమార్, జొల్లు రోహిణి, వీరశైవ సమాజం ప్రతినిధులు బస్వరాజ్, సడ్గి భద్రణ్ణ, బస్వరాజ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



భద్రేశ్వర జాతరలోని రథం



కలశాన్ని రథంపై ఎక్కించే ముందు పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కె.సుజాత, తదితరులు

రథోత్సవం కోసం భారీ బందోబస్తు

భద్రేశ్వర ఉత్సవాల్లో భాగంగా ప్రధానఘట్టం రథోత్సవానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు డీఎస్పీలు, ఏడుగురు సీఐలు, 20మంది ఎస్‌ఐలు,పదకొండు ఏఎస్‌ఐలు, 30మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 41మంది హోం గార్డులతో బందోబస్తును నిర్వహించారు.

ఎమ్మెల్సీ దయాకర్.. నోరు అదుపులో పెట్టుకో

చేవెళ్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అద్దెంకి దయాకర్ ప్రధాని నరేంద్రమోదీని వాడువీడు అనడం సంస్కారం కాదని, అతడు నోరు అదుపులో పెట్టుకోవాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం ధ్వజమెత్తారు. శనివారం చేవెళ్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీగా పదవి చేపట్టిన దయాకర్ మంత్రి పదవివిస్తారేమోనని ప్రధాని నరేంద్ర మోదీపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం ఒక చట్ట సభ సభ్యుడిగా అతడికి తగదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్కడ.. దయాకర్ ఎక్కడని ఎద్దేవా చేశారు. నీవెంత.. నీ బతుకెంత? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత జాతి తలదించుకునే పరిస్థితి తీసుకువస్తున్నావని మండిపడ్డారు. అతడు తన మాటతీరు మార్చుకోకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. రాహుల్ గాంధీకి అధికారం రాకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఎమ్మార్జెన్సీ పాలనలో నాయకులను జైళ్లలో పెట్టించింది కాంగ్రెస్సే అని గుర్తుచేశారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి సాధించిందన్నారు. దేశ రక్షణ, పేదరిక నిర్మూలనకు శ్రమిస్తున్నారని చెప్పారు. 370 ఆర్టికల్, రామ మందిరం, వక్ఫ్ బోర్డు, ట్రిపుల్ తలాక్ వంటి చరిత్రాత్మక చట్టాలు మోదీతోనే సాధ్యమయ్యాయన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, దేవుని శర్వలింగం, ఆంజనేయులుగౌడ్, మాణిక్యరెడ్డి, జయశంకర్, కృష్ణమోహన్, జయసింహారెడ్డి, అభిలాష్‌రెడ్డి, అనంతయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్నమాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం

అనంతుడికే ఎసరు!

(7వ పేజీ తరువాయి)

భక్తులు, చుట్టుపక్కలా ఉన్న గ్రామాల ప్రజలు, ఆలయ నిర్వాహకులు ఆలయం నిర్మించి నిత్యం పూజలు చేస్తున్నారు. అనంతగిరిలో ఏ విధంగా అయితే కార్తీక, ఆషాఢ మాసాల్లో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారో అదేవిధంగా ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయం సమీపంలో పురాతన ఆనవాళ్లు, కట్టడాలు, అనంతపద్మనాభ స్వామి నడిచిన పాద ముద్రలు కన్పిస్తాయి. ఆలయం వద్ద ఉన్న రెండు పుష్కరిణుల్లో నిరంతరం నీరు ఉంటుంది. మండుటెండలో సైతం ఇక్కడి పుష్కరిణిలో నీరు ఉంటుందని, ఇంత వరకు ఎప్పుడూ ఎండిపోలేదని భక్తులు చెబుతున్నారు. ఈ ఆలయంలో సుమారు 80 ఏళ్ల కిందట మొరంగపల్లి గ్రామానికి చెందిన మద్ది నారాయణరెడ్డి రోజూ ఈ దేవాలయానికి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించే వారని, ఆయన మరణానంతరం స్వామి వారికి అనవాయితీగా పూజలు నిర్వహిస్తూ వచ్చారు. ఆ కుటుంబం వారసులు హైదరాబాద్‌లో స్థిరపడడంతో బిక్కారెడ్డిగూడెం, మొరంగపల్లి, మోమిన్‌పేట్ పరిసర గ్రామాల భక్తులే దేవాలయ నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తున్నారు.

ఆలయానికి ఐదెకరాలు

పేరొందిన అనంత పద్మనాభస్వామి ఆలయానికి భూమి కేటాయించాలని గతంలో గ్రామస్తులు, భక్తులు అధికారులను కోరడంతో దేవాలయానికి సర్వే నంబర్ 280లో ఐదెకరాలు కేటాయించారు. అంతేగాక, సర్వే నంబర్ 409లో మొత్తం 12.34 ఎకరాల భూమి ఏడుగురి మధ్యలో ఉండగా అందులో ఓ వ్యక్తి 1.34 ఎకరాల భూమిని ఆలయం కోసం విడిచిపెట్టారు. అందుకు సంబంధించిన భూమి బూచన్‌పల్లి చిన్న బాల్‌రెడ్డికి చెందినది కాగా, ఆయన ఆలయానికి విడిచిపెట్టారు. కాగా, ఆ భూమిని ఎవరో కావాలని ఇతరుల పేరుపై అక్రమంగా రికార్డులు సృష్టించి అమ్మకానికి పెట్టారు. ఇలా ఆ భూమి ముగ్గురి చేతులు మారినా ఎవరూ ఆలయం వద్దకు రాలేదు. 12.34 ఎకరాలకు సంబంధించిన వివాదం కోర్టులో కొనసాగుతోంది.



దేవాలయం భూమిలో వేసిన కంచె

ఆలయ భూమిని రక్షించాలి



ఆలయానికి చెందిన ఐదెకరాల భూమితోపాటు 1.34 ఎకరాల భూమిని అధికారులు, పాలకులు కాపాడాలి. ఏళ్ల చరిత్ర కలిగిన దేవాలయానికి ఆ భూమి చెందే విధంగా చర్యలు తీసుకోవాలి. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి దేవుడికి కేటాయించిన భూమి దేవాలయానికి చెందే వరకు పోరాటం చేస్తాం

- కాళప్ప, మోమిన్‌పేట

దౌర్జన్యం చేస్తున్నారు



ఆలయ భూమిలో ఉన్న దేవతా వృక్షాలు, అయ్యప్ప స్వాముల కోసం నిర్మించిన సత్రాలను ఆక్రమించి కంచె వేసి ఎవరినీ ఆ వైపు వెళ్లనివ్వడం లేదు. వారు గుట్ట వరకు ఆలయానికి విడిచిపెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటే మంచిది. భగవంతుడి భూమిని ఆక్రమించేందుకు కంచె వేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలి.

- పాండు, మోమిన్‌పేట

నా దృష్టికి రాలేదు



అనంతపద్మనాభ స్వామి ఆలయ భూములకు సంబంధించిన వివాదం నా దృష్టికి రాలేదు. మా దృష్టికి ఎవరైనా తీసుకు వస్తే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. రికార్డులను చూసి ఆలయ భూమిలో అక్రమంగా కంచె వేసి కబ్జా చేస్తున్నట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- మనోహర్ చక్రవర్తి, తహసీల్దార్, మోమిన్‌పేట్

సినీ నిర్మాత అల్లుడి దౌర్జన్యం

చివరికి ఆ భూమిని ఓ బడా సినీ నిర్మాత అల్లుడు కొనుగోలు చేసి దౌర్జన్యంగా దేవాలయానికి కేటాయించిన భూమిని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. పూర్తిగా ఆలయం పక్క నుంచే కంచె వేసి ఆలయ సత్రాలు, దేవతా వృక్షాల వైపు ఎవరినీ వెళ్లనివ్వడం లేదు. ఆ భూమి ఆలయానికి చెందినదని భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నా వినిపించుకోవడం లేదని, అనంతపద్మనాభస్వామి కొలువుదీరిన భూములను ఆక్రమించేందుకు కంచె వేశారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ భూములను కబ్జా చేస్తున్నారని, పాలకులు, అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ చేసి ఆలయ భూమిని కాపాడాలని భక్తులు కోరుతున్నారు. ఇదిలా ఉంటే, భూ సమస్యలకు సంబంధించిన వ్యవహారాల్లో కలుగచేసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలు ఉన్నా.. పోలీసు అధికారులే దగ్గర నుంచి కంచె నిర్మాణం చేసుకునేలా సహకరించడం ఎంత వరకు సమంజసమని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

క్రైం కార్నర్

సకాలంలో వైద్యం అందక శిశువు మృతి

● ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యుల ఆందోళన

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సకాలంలో వైద్యం అందక శిశువు మృతిచెందాడంటూ ఓ కుటుంబం మేడ్చల్ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం రాత్రి ఆందోళన చేసింది. వివరాల్లోకి వెళ్తే.. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం కుక్కునూరు గ్రామానికి చెందిన వంశీ భార్య శిరీష ఈనెల 15వ తేదీన మేడ్చల్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాగా శుక్రవారం శిశువు అస్వస్థతకు గురికావటంతో తల్లి శిరీష ఆస్పత్రి నర్సులకు విషయాన్ని తెలిపింది. దీంతో నర్సులు డాక్టర్ వస్తాడని చెప్పి ఆస్పత్రిలోనే ఆపారు. అనంతరం శిశువు పరిస్థితి విషమించటంతో పట్టణంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం మరింత క్షీణించటంతో వెంటనే నగరంలోని పెద్ద ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందింది. దీంతో శిశువు తల్లిదండ్రులు ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ పాప మృతిచెందిందంటూ ఆస్పత్రి ఎదుట నిరసన చేపట్టారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పిల్లల డాక్టర్ సెలవులో ఉండటంతో అందుబాటులో లేరని సంబంధిత అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

● 12 మందికి గాయాలు ● దైవదర్శనానికి వెళ్తుండగా ఘటన

పరిగి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓ తవేరా వాహనం ఒక స్కూటీని తప్పించబోయి మరోస్కూటీని ఢీకొట్టిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా 12 మందికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం పరిగి మునిసిపల్ పరిధిలోని సయ్యద్‌మల్కాపూర్ గేట్ దగ్గర జరిగింది. పూడూరు మండలం చెంచుపల్లి గ్రామానికి చెందిన చెంచు తిరుమలయ్య కుటుంబం మనువడి పుట్టు వెంట్రుకలు తీసేందుకు హన్వాడ మండలం గొండ్యాల గ్రామంలోని తిరుమల దేవుడి దగ్గరకు తవేరా వాహనంలో వెళుతున్నారు. శనివారం పరిగి మునిసిపల్ శివారులోని సయ్యద్‌మల్కాపూర్ గేట్ దగ్గర ఎదురుగా వస్తున్న స్కూటీని తప్పించబోయి మరో స్కూటీని ఢీకొన్న తవేరా పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న పరిగి మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఈడ్గి గున్నమ్మ(60), శ్రీనివాస్‌లకు తీవ్రగాయాలు కాగా వికారాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గున్నమ్మ మృతిచెందింది. తవేరాలో ఉన్న తిరుమలయ్య, వైష్ణవ్, ప్రవళిక, శివమణి, ఎల్లమ్మ, వెంకటేశ్, లక్ష్మి, శిరీష, అంజమ్మ, ప్రసాద్, పి.ఎల్లమ్మ, ఎం.ఎల్లమ్మలకు గాయాలయ్యాయి. వీరిని 108 అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారు స్వగ్రామానికి వెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృత దేహం

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృత దుహం లభ్యమయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్-మేడ్చల్ పట్టణం రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద చెరువు కల్వర్టు సమీపంలో శనివారం ఓ గుర్తు తెలియని మహిళ మృత దేహం కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ జరిపి మృత దేహాన్ని పోస్టు మార్టం నిమితం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. మృతు రాలి వయసు 35-40మధ్య ఉండవచ్చని, మద్యం మత్తులో కింద పడి మృతి చెంది ఉండ వచ్చని పోలీసులు భావిస్తున్నారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చైన్‌స్నాచర్ రిమాండ్

ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని మజీద్ సమీపంలో వృద్ధురాలు దర్శబోయిన పద్మఆనంద్ మెడలో నుంచి బంగారు చైన్ అపహరించుకెళ్లిన సంగతి తెలిసిందే. ఈ చోరీకి పాల్పడిన దొంగను పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. క్రైం సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, యెర్రగొండ గ్రామానికి చెందిన నక్క సూర్య వెంకటస్వామి(24) నగరంలోని కర్మన్‌ఘట్‌లో ఉంటూ క్యాబ్‌డ్రైవింగ్ చేస్తుంటాడు. క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని అప్పులు తీర్చేందుకు చైన్‌స్నాచింగ్ చేయాలని నిశ్చయించుకొని శుక్రవారం మధ్యాహ్నం అన్నోజిగూడలోని పద్మ ఇంటి ముందు కారు ఆపి తాగడానికి నీళ్ల అడిగి ఆమె మెడలోని నాలుగున్నర తులాల మంగళసూత్రం ఎత్తుకెళ్లాడు.బాధితురాలి ఫిర్యాదు మేరకు మల్కాజ్‌గిరి ఏసీపీ ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దొంగను గుర్తించి అరెస్టు చేశారు. నిందితుడి నుంచి నాలుగున్నర తులాల మంగళసూత్రం, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దొంగను శనివారం రిమాండ్‌కు తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చైన్‌స్నాచింగ్ జరిగిన 5గంటల్లోపే దొంగను పట్టుకున్న క్రైంసీఐ శ్రీనివాస్, ఎస్ఐ శివకృష్ణ, సిబ్బందిని రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీలు అభినందించారు.

ఇంట్లో నగదు చోరీ

కీసర రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడి నగదును ఎత్తుకెళ్లిన ఘటన శనివారం కీసర పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం మున్సిపాలిటీ శిల్పానగర్ కాలనీలోని పార్యామౌంట్ అపార్ట్‌మెంట్ బ్లాక్ నంబర్ 3జి, ఫ్లాట్ నంబర్ 101లో శశీంద్రన్ తన కుటుంబసభ్యులతో నివాసముంటున్నాడు. తన తండ్రి వైద్యం కొరకు శుక్రవారం సాయంత్రం కేరళకు బయల్దేరి వెళ్లారు. అర్ధరాత్రి దొంగలు ఇంటి గ్రిల్స్‌ను, మెయిన్‌డోర్‌ను పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. అల్మారా తాళం పగులగొట్టి అందులోని రూ.15వేల నగదును ఎత్తుకెళ్లారు. అపార్ట్‌మెంట్‌లోని పైఅంతస్థులో ఉండే వ్యక్తి గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పందిని తరలిస్తున్న వారిపై కేసు

ధారూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసమందర్ అటవీ ప్రాంతంలో అడవిపందిని వేటాడి చంపి ఆటోలో తరలిస్తుండగా అటవీశాఖ అధికారులు శనివారం పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ధారూరు అటవీ రేంజర్ రాజేందర్ తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నాగసమందర్ అటవీ ప్రాంతంలో అడవిపందిని వేటాడిచంపి ఆటోలో తరలిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు పక్కా సమాచారం అందింది. దీంతో అటవీశాఖ అధికారులు సిబ్బందితో అక్కడి వెళి ఆటోను పట్టుకున్నారు. అడవి పందిని వేటాడి చంపి తరలిస్తున్న బంట్వారం మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన వెంకటేశం, తిమ్మాపురం రాజు, రమేశ్, ముత్యాలు, ప్రశాంత్, మాణయ్య, రాజేష్, మారుతిలపై కేసు నమోదు చేసినట్లు రేంజర్ తెలిపారు.

కుక్కల దాడిలో 15 మేకపిల్లలు మృత్యువాత

దోమ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మోత్కుర్‌లో కుక్కల దాడిలో 15మేక పిల్లలు మృత్యువాతపడ్డాయి. గ్రామానికి చెందిన జీడి అంజయ్య పొలం వద్ద పశువుల షెడ్డులో 15 మేక పిల్లలను ఉంచాడు. శనివారం ఉదయం అంజయ్య ఉపాధి పనులకు వెళ్లాడు. పనులు ముగించుకొని పొలం వద్ద ఉన్న షెడ్డులో చూడగా కుక్కల దాడిలో 15 మేక పిల్లలు మృత్యువాతపడటంతో కన్నీటిపర్యంతమయ్యాడు. మేక పిల్లల విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని వేడుకున్నాడు.

అంబులెన్స్‌లో ప్రసవం

బషీరాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన తాండూరు రైల్వే బ్రిడ్జ్ సమీపంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన తస్నీర్(22)కు పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. గర్భిణీకి రక్తం తక్కువగా ఉందని కుటుంబీకులకు తెలిపిన వైద్యులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేసి పిలిపించారు. అంబులెన్స్‌లో తాండూరులోని మాతా శిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో రైల్వే బ్రిడ్జి సమీపంలోకి రాగానే నొప్పులు అధికమయ్యాయి. పైలట్ దస్తప్ప వాహనాన్ని పక్కకు నిలపడంతో ఈఎంటీ హరీశ్ డెలివరీని విజయవంతం చేశారు. అనంతరం తాండూరులోని ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

108 సిబ్బందికి సన్మానం

పెద్దేముల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదిపల్లి గ్రామానికి చెందిన నాగమ్మకు పురిటినొప్పులు రావడంతో 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమెకు డెలివరీ అయింది. పుట్టిన శిశువులో చలనం లేకపోవడంతో 108 సిబ్బంది ఈఎంటీ నర్సింహులు సీపీఆర్ చేసి శిశువుకు ప్రాణం పోశారు. దీంతో గాజీపూర్ గ్రామానికి చెందిన యూత్ సభ్యులు ఈఎంటీ నర్సింహులుతో పాటు పైలట్‌లు మహేష్, నర్సింహులులను పూలమాల, శాలువాలతో సన్మానించారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

కీసర, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని జిల్లా విద్యాధికారి విజయకుమారి అన్నారు. మండల విద్యాధికారిగా సేవలందించిన శశిధర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం చీర్యాల్‌లోని జయమోహన్ గార్డెన్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా విద్యాధికారి విజయకుమారి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డిలు విచ్చేశారు. ఈసందర్భంగా వారు శశిధర్‌ను శాలువాతో సత్కరించారు. కొన్నేళ్లుగా కీసర మండల విద్యాధికారిగా సేవలందించిన శశిధర్ అందించిన సేవలను కొనియాడారు.

ప్రభుత్వ ఆస్పత్రిని త్వరగా ప్రారంభించాలి

వికారాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రిని త్వరగా ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నూతనంగా నిర్మించిన ఆస్పత్రిని శనివారం ఆయన సందర్శించారు. భవనం పూర్తి అయి ఆరు నెలలైనా ఇంకా ప్రారంభించాలేదన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివరాజు, మోహన్ రెడ్డి, సుధాకర్, ఆచారి, రాఘవేందర్, అడ్వకేట్ శ్రీనివాస్, రాములు, అనంతయ్య, గోపాల్ పాల్గొన్నారు.

దాడులను నిరసిస్తూ ర్యాలీ

ఘట్‌కేసర్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ శనివారం ఘట్‌కేసర్‌లో విశ్వహిందూ పరిషత్, భజరంగ దళ్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, అరవింద్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'అగ్నిపథ్'కు ఎంపికైన యువతకు సన్మానం

తాండూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తాండూరు శ్రీరామ కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అగ్నిపథ్ ఆర్మీకి ఎంపికైన యువకులను తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి శనివారం తన కార్యాలయంలో సన్మానించారు. దేశానికి, తాండూరుకు పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు బాలకృష్ణ, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ కేవీఎం వెంకట్, పాల్గొన్నారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

తాండూరు రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నేటి(ఆదివారం) నుంచి ఈనెల 26వ తేదీ వరకు ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరిగే పరీక్షా కేంద్రాలను తహసీల్దార్ తారాసింగ్, ఎంఈవో వెంకటయ్యలు పరిశీలించారు. తాండూరులోని జీజేసీ పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను వారు పరిశీలించి, విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తహసీల్దార్ తారాసింగ్ సూచించారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో నర్సింహారెడ్డి కుటుంబసభ్యులు

దుద్యాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): హకీంపేట్ ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పునర్ నిర్మాణంలో భాగంగా ఆలయాన్ని తొలగించే ముందు పురోహితుల మంత్రోచ్చరణల మధ్య హోమం చేపట్టి విగ్రహాలను కదిలించారు. కోటి రూపాయలతో ఆలయ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి బలం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

కోట్‌పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పార్టీకి కార్యకర్తలే బలమని ప్రతీ కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు అనంద్ అన్నారు. మండల పరిధిలోని కరీంపూర్ సమీపంలోని వైటికన్వెన్షన్‌లో శనివారం కార్యకర్తల సమావేశం, 27న జరిగిగే రాజతోత్సవ సమావేశం నిర్వహించారు. నూతనంగా నియమించిన మండల కమిటీని సన్మానించారు. మండల అధ్యక్షుడిగా సుందరి అనిల్, ఉపాధ్యక్షులు, కార్యదర్శిలను నియమించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్‌యాదవ్, కొండల్‌రెడ్డి, మల్లయ్య, దశరథ్‌గౌడ్, మహేందర్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

మోమిన్‌పేట్: ప్రతీ ఒక్కరు దైవచింతన అలవర్చుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మండలంలోని ఎన్కతలలో శ్రీ శనేశ్వరస్వామి, శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామిని శనివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి రామ్ పంతులు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఆయన సతీమణి సబిత ఆనంద్‌లకు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, సొసైటీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాకూరి శ్రీనివాస్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సన్నరకం వరినే సాగు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

పరిగి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రైతులు సన్నరకం వరిసాగునే చేయాలని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

దౌల్తాబాద్: మండల కేంద్రంలో పీఏసీఎస్ అధ్వర్యంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి శనివారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ కార్యదర్శి అనంతయ్య, ప్రమోద్‌రావు, లింగప్ప పాల్గొన్నారు.

రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలి

దోమ: అకాల వర్షంతో రైతులకు నష్టం వాటిల్లకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ దోమ మండల నాయకులు కోరారు. మండల కేంద్రంలో శనివారం గన్నీ బస్తాలు లేకపోవడంతో కల్లాల్లోనే వరి ధాన్యం కుప్పలను పరిశీలించారు. వరి కోతలు ప్రారంభమై 15 రోజులు గడుస్తున్నా పూర్తి స్థాయిలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, గోపాల్‌గౌడ్, మల్లేశం, రాజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సలీం పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

యాలాల, ఏప్రిల్ 19, (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవనూరు, విశ్వనాథ్‌పూర్, యాలాల, సంగెంఖుర్దు గ్రామాల్లో శనివారం ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగెంఖుర్దు హన్మంతు, తహసీల్దార్ అంజయ్య పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

యాలాల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి 13 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

తాండూరు రూరల్: చెంగోల్ గ్రామ శివారులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. చెంగోల్ గ్రామ సమీపంలోని చింతామణిపట్నం, పర్వతాపూర్, అంతారం తండా, గౌతాపూర్, గోపన్‌పల్లి, అల్లాపూర్, సిరిగిరిపేట్, వీరారెడ్డిపల్లి, రాంపూర్‌మీదితండా, రాంపూర్ కింది తండా తదితర గ్రామాల్లో పండించిన వరిపంటను విక్రయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

పరిగి ఎమ్మెల్యేపై ఫిర్యాదు

పరిగి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఇటీవల ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేయడంతోపాటు, అనుచిత వాఖ్యలు చేసిన పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితోపాటు, ఇతర నాయకులకు కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని శనివారం పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఆ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జి.బాలకిష్టారెడ్డి, మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు ఉన్నారు.

మర్పల్లి: ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, అద్దంకిదయాకర్, అంజన్‌కుమార్ యాదవ్‌లపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లేశ్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల లక్ష్మయ్య, శ్రీధర్ రెడ్డి, నాగన్న, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

బ్రేకులు ఫెయిలై నిలిచిన బస్సు

దోమ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పరిగికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు దోమ మండల కేంద్రంలో బ్రేకులు పని చేయకపోవడంతో నిలిచిపోయింది. బస్టాండ్ నుంచి బయల్దేరిన బస్సు వంద మీటర్ల దూరం వెళ్లగానే బ్రేకులు ఫేయిల్ అయినట్లు గుర్తించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేశాడు. దీంతో ఊపిరిపీల్చుకున్నారు. కాలం చెల్లిన బస్సులు నడపడంతోనే తరచూ ఇబ్బందులు తప్పడంలేదని ప్రయాణికులు వాపోతున్నారు.

సంక్షిప్తంగా..

ప్రమాదకరంగా ఉన్న చెట్లు, విద్యుత్ స్తంభాలను తొలగించాలి

వికారాబాద్: వికారాబాద్‌లో ప్రమాదకరంగా శిథిలావస్థలో ఉన్న కరెంట్ స్తంభాలను, చెట్లను తొలగించాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ కలెక్టరేట్‌లో శనివారం వినతి పత్రం అందజేశారు.

అల్లిఖాన్‌పల్లిలో వీధినాటకం

దుద్యాల: అల్లిఖాన్‌పల్లిలో శుక్రవారం రాత్రి చిన్నకేశవస్వామి వీధి నాటకాన్ని ప్రదర్శించారు. నాలుగు రోజుల పాటు రోజు విడిచి రోజు నిర్వహిస్తున్నట్లు నాటకోపాధ్యాయుడు ఆంజనేయులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

బొంరాస్‌పేట్/ఘట్‌కేసర్ రూరల్: బొంరాస్‌పేట్ మండలం నాందర్‌పూర్‌లో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి శోభారాణి తెలిపారు. అదేవిధంగా ప్రతాప్‌సింగారంలోని ప్రధాన చౌరస్తాలో శనివారం చలివేంద్రాన్ని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

బొంరాస్‌పేట్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎన్కెపల్లిలో శనివారం ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. స్థానిక పాఠశాల నుంచి గురుకుల సీట్లు సాధించిన నాల్గో తరగతి విద్యార్థులు స్నేహశ్రీ, నిషిత్‌కుమార్‌తో పాటు నలుగురిని ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

చౌడాపూర్: మండల కేంద్రంలో పరిగి గాలయ్య భార్యకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.24వేలు సీఎం సహాయ నిధి చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్పాటి అశోక్‌కుమార్ పార్టీ నాయకులతో కలిసి అందజేశారు.

శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల అందజేత

తాండూరు: పట్టణంలో మూడు నెలల పాటు మహిళలకు ఉచితంగా కంప్యూటర్, టైలరింగ్ , సరుపు తయారీలో శిక్షణ పొందిన మహిళలకు శనివారం అర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

అర్హులను పారదర్శకంగా గుర్తించాలి

శామీర్‌పేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులను పారదర్శకంగా గుర్తించాలని శామీర్‌పేట ఎంపీడీవో మమతాబాయి అన్నారు. ఆమె శనివారం పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు.

కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కీసర రూరల్: పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని మేడ్చల్ జిల్లా భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసింది.

మత్స్యకారులకు స్కిల్ టెస్ట్

కులకచర్ల: మత్స్యకారులకు శనివారం మత్స్య సహకార శాఖ జేడీ నాగార్జున, ఏడీ వెంకన్న ఆధ్వర్యంలో ముజాహిద్‌పూర్ గ్రామ మత్స్య సహకార సంఘం 40 మంది సభ్యులు, వీరాపూర్ గ్రామసభ్యులు ఆరుగురికి కామునిపల్లి చెరువులో స్కిల్‌టెస్ట్ నిర్వహించారు.

నూతన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

చౌడాపూర్: చౌడాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతన ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతల చేపట్టిన మల్లికార్జున్‌ను శనివారం యూటీఎఫ్ నాయకులు శేఖర్ సన్మానించారు.

ఎఫ్‌డబ్ల్యూఎఫ్ మండల కన్వీనర్‌గా వెంకటేశ్

చౌడాపూర్: చౌడాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్‌డబ్ల్యూఎఫ్ మండల స్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించి మండల కన్వీనర్‌గా వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

పాఠశాలలను పరిశీలించిన అధికారులు

బొంరాస్‌పేట్: జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశాల మేరకు ఎంఈవో హరిలాల్ శనివారం ఏఈ సురేందర్‌రెడ్డితో కలిసి బొంరాస్‌పేట్ మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు.

భద్రేశ్వర స్వామి జాతరలో అన్నదానం

తాండూరు: భావిగి భద్రేశ్వర స్వామి జాతరలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు శుభప్రద్ పటేల్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కాళికాదేవి దేవాలయ అధ్యక్షుడిగా బస్వరాజ్

తాండూరు: కాళికాదేవి దేవాలయం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ పి.బస్వరాజ్ నియమితులయ్యారు. సభ్యులుగా వెంకటయ్య , వెంకటేష్, మనోహరి, సునిత, బి.శివకుమార్, లాలప్పను నియమించారు. వారిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు.

బాధిత కుటుంబాలకు స్పీకర్ పరామర్శ

మర్పల్లి: మర్పల్లి మండల కేంద్రానికి చెందిన జోసెఫ్ కుమారుడు కార్తీక్, మర్పల్లి మండల కేంద్రానికి చెందిన న్యాయవాది మోహన్‌రెడ్డి తల్లి ప్రమీల, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ పటేల్ భార్య సాజిదాబీ అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శనివారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్ పాల్గొన్నారు.